# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ

**పత్రికా ప్రకటన**

**ఆగస్టు 20, 2011**

# ఫాసిస్టు రమన్ ప్రభుత్వం సాగిస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్లను నిరసించండి!
# ప్రజలపై సాగిస్తున్న యుద్ధం - ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఆపెయ్యండి!!

ఆదివాసీ బాలిక మీనా ఖల్కో బూటకపు ఎన్‌కౌంటర్ వార్త ప్రజల స్మృతిపథం లోంచి ఇంకా చెరిగిపోకముందే ఛత్తీస్‌గఢ్ ఫాసిస్టు రమన్ ప్రభుత్వం మరో బూటకపు ఎన్‌కౌంటర్‌కు పాల్పడి తన ఆదివాసీ వ్యతిరేక క్రూర ముఖాన్ని మరోసారి తేటతెల్లం చేసింది. దక్షిణ బస్తర్‌లోని కెర్లాపాల్ ప్రాంతంలో, చిక్‌పాల్ గ్రామ పటేల్ మడ్కామి మాసాను పోలీసులు ఇంటి నుండి పట్టుకెళ్లి 2011 ఆగస్టు 6న కాల్చిచంపి ఎన్‌కౌంటర్లో అజ్ఞాత నక్సలైట్ చనిపోయాడని ప్రకటించి శవాన్ని పూడ్చేశారు. గత నెలలో మీనా ఖల్కో అనే పదహారేళ్ల అమ్మాయిపై పోలీసు ముష్కరులు సామూహిక లైంగిక అత్యాచారం జరిపి కాల్చి చంపి ఎప్పటి లాగానే 'ఎన్‌కౌంటర్‌లో ఒక మహిళా నక్సలైట్ మృతి' అని ప్రకటించారు. అంతకు మునుపు, మార్చి నెలలో చింతల్‌నార్ ప్రాంతంలో ప్రభుత్వ సాయుధ బలగాలు సాగించిన హత్య, దోపిడీ, దహనకాండ, మహిళలపై అత్యాచారాల బీభత్సకర క్యాంపెయిన్ అందరి మెదళ్లలో ఇంకా తాజాగానే వుంది. ఈ సంఘటనలపై ఛత్తీస్‌గఢ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా వివిధ సెక్షన్ల ప్రజలు నిరసన తెలిపారు. చింతల్‌నార్ సంఘటనపై దేశ సర్వోన్నత న్యాయస్థానం సీబీఐ విచారణకు ఆదేశించింది. అయినప్పటికీ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం వీటన్నిటినీ ఏ మాత్రం లెక్కచెయ్యకుండా బూటకపు ఎన్‌కౌంటర్‌లలో ఆదివాసులను హతమార్చే ప్రక్రియను నిరాటంకంగా కొనసాగిస్తున్నది.

వాస్తవానికి, మొదట సల్వాజుడుం, ప్రస్తుతం ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో సాగుతున్న ఫాసిస్టు అణచివేత క్యాంపెయిన్‌లో భాగంగా ఛత్తీస్‌గఢ్‌లోని ప్రత్యేకించి బస్తర్, సర్గూజ ప్రాంతాలలో ప్రభుత్వ సాయుధ బలగాలు ఇప్పటి వరకు వందలాది ఆదివాసుల్ని హత్య గావించాయి. ముఖ్యంగా గత ఆరేళ్లుగా నక్సలైట్లు చనిపోయారని ప్రకటిస్తూ చేసిన ఎన్‌కౌంటర్‌లలో 99 శాతం బూటకమైనవే. గ్రామాలపై దాడుల సందర్భంగా ప్రజలను పట్టుకొని కాల్చిచంపడమో లేదా కనిపించగానే నిరాయుధ ప్రజలపై గుళ్లవర్షం కురిపించడమో చేయడం సాధారణం. అయితే చాలా తక్కువ సందర్భాల్లోనే వాస్తవాలు బైటికి వస్తున్నాయి. ఎందుకంటే ఒక యుద్ధ క్షేత్రంగా మారిన ఈ ప్రాంతం నుండి వాస్తవాలు బైటికి రావడం చాలా కష్టం. వాస్తవాల్ని బైటికి తేవాలని ప్రయత్నించే విలేకరులపై, మానవహక్కుల కార్యకర్తలపై దాడులు చేస్తున్నారు. వాళ్లను ఇక్కడి నుండి వెళ్లగొడతున్నారు.

సీపీఐ (మావోయిస్టు) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మీనా ఖల్కో, మడ్కామి మాసాల దారుణ హత్యలను తీవ్రంగా ఖండిస్తోంది. మడ్కామి మాసా హత్యకు వ్యతిరేకంగా ఆయన కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు, వివిధ ఆదివాసీ నాయకులు ఐక్యమై నిరసన పోరాటాన్ని ఆరంభించారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ప్రజలు చక్కాజాంలు, ధర్నాలు నిర్వహిస్తున్నారు. కానీ ప్రభుత్వం ఇప్పటికీ దోషులను కాపాడడం కోసమే చూస్తున్నది. వాస్తవానికి ప్రభుత్వ ఆదేశాలు లేకుండా పోలీసులు లేదా అర్ధసైనిక బలగాలు బూటకపు ఎన్‌కౌంటర్‌లకు పాల్పడుతున్నారని భావించడం తప్పే అవుతుంది. బూటకపు ఎన్‌కౌంటర్‌లలో ఆదివాసులను హత్య చేసే ఈ క్యాంపెయిన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుపుతున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్ - ప్రజలపై యుద్ధంలో భాగమే. సోనియా-మన్మోహన్-చిదంబరం-ప్రణబ్ ముఖర్జీ-రమన్ సింగ్‌ల పాలక ముఠా నాయకత్వంలో మావోయిస్టు వుద్యమాన్ని సమూలంగా నిర్మూలించే పేరుతో సాగుతున్న ఈ అన్యాయమైన యుద్ధం లక్ష్యం దేశంలోని అమూల్యమైన ఖనిజ సంపదను విదేశీ, బడా పెట్టుబడిదార్లకు కట్టబెట్టడమే. ఇలాంటి హత్యల ద్వారా ప్రజలను బీభత్సానికి గురిజేసి వాళ్లను విప్లవోద్యమం నుండి వేరు చేయాలనుకునే కుట్ర ఇది.

మీనా ఖల్కో, మడ్కామి మాసాల హత్యలకు బాధ్యులైన పోలీసు, పారామిలిటరీ అధికారులనూ, ఇలాంటి దురంతాలకు పాల్పడేలా

వాళ్లను ప్రోత్సహించిన చిదంబరం, రమన్‌సింగ్, శేఖర్ దత్, ననకీరాం వంటి నేతలనూ వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలనే డిమాండ్‌తో వుద్యమించాలని సీపీఐ (మావోయిస్టు) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ఛత్తీస్‌గఢ్ సహా దేశ ప్రజలనూ, ప్రజాస్వామికవాదులనూ, కార్మిక-కర్షకులనూ, విద్యార్థి-మేధావులనూ, కవులు-కళాకారులు-విలేకరులనూ కోరుతున్నది. మడ్కామి మాసా హత్యకు వ్యతిరేకంగా బస్తర్ ప్రాంతంలో సాగుతున్న ప్రజా పోరాటానికి హృదయపూర్వక మద్దతునివ్వాలనీ, సహాయపడాలనీ మేం విజ్ఞప్తి చేస్తున్నాం. అణచివేత విధానాలకు ప్రజా ప్రతిఘటనను తీవ్రతరం చేయడం ద్వారానే జవాబు ఇస్తామనీ, ఆదివాసులను దారుణంగా హత్య చేసి వాళ్ల జల్-జంగల్-జమీన్‌లను కొల్లగొట్టాలనే కుట్రలను తప్పక ఓడిస్తామనీ మేం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరిస్తున్నాం. ప్రభుత్వ సాయుధ బలగాలు పాల్పడుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా సంఘటిత, విశాల, సమరశీల పోరాటాలకు పూనుకోవాలనీ, దోపిడీదొంగలు నడుపుతున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఓడించాలనీ మేం పోరాటశీలురైన దండకారణ్య ప్రజలందరికీ పిలుపునిస్తున్నాం.

(గుడ్సా ఉసెండి)

అధికార ప్రతినిధి

దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ,

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)